
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 14 । మే । 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు శనివారం 430 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి రాగా టన్ను గరిష్టంగా రూ.36 వేలతో అమ్ముడు పోయాయి.



భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

8లో

పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో ధర్మవరానికి చెందిన ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

గరిష్టం/కనిష్టం
39.7°/23.4°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికంగానే ఉంది. పశ్చిమ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

రోగులకు మెరుగైన వైద్యం అందాలి

- వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి



గుట్టూరు పీహెచ్‌సీ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ వేమిరెడ్డి రామిరెడ్డి

పెనుకొండ రూరల్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతి రోగికీ నాణ్యమైన వైద్య సేవలు అందాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వేమిరెడ్డి రామిరెడ్డి ఆదేశించారు. పెనుకొండ మండలం గుట్టూరు పీహెచ్‌సీతో పాటు వెంకటగిరిపాళ్యం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు, ల్యాబ్, ఫార్మసీ గదులను పరిశీలించారు. ఓపీ సేవలు, ల్యాబ్‌లో చేస్తున్న వైద్య పరీక్షలు, రోగులకు అందజేస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌హెచ్‌పీల పనితీరును దగ్గరుండి పరిశీలించారు. వార్డుల్లో పర్యటిస్తూ రోగులతో మమేకమై అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు. 50 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులు, ఇంజెక్షన్లను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. నడవలేని వారికి ఇంటి వద్దకే వైద్యసేవలు అందించేలా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలని, విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, డాక్టర్ నాగరాజు నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన..

అనంతపురం క్రైం: స్థానిక సర్వజనాస్పత్రిలో శ్రీ సత్యసాయి జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో విధులు నిర్వర్తించే వైద్యాధికారులకిచ్చే శిక్షణ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర సంచాలకుడు (డైరెక్టర్ ఆఫ్ హెల్త్) డాక్టర్ రామిరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణలో సీనియర్ వైద్యులు సూచిస్తున్న అంశాలపై అవగాహన పెంచుకుని విధి నిర్వహణలో ఆచరణలో పెట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అంకితభావంతో వైద్య సేవలందించడం ప్రతి వైద్యుడూ కర్తవ్యంగా భావించాలన్నారు. అనంతరం కలుషిత ఆహారంతో సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం బేలోడు గ్రామస్తులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బీమసేనాచార్‌ను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ బడులకు పటిష్ట భద్రత

- పాఠశాలల పరిరక్షణపై జగన్ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ
- జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 238 మంది నైట్ వాచ్‌మెన్ల నియామకం



కొత్తచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విధుల్లో ఉన్న నైట్ వాచ్‌మెన్ పెద్దన్న

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యార్థుల అభ్యున్నతికి పెద్ద పీట వేస్తూ కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ బడులను సర్వాంగ సుందరంగా జగన్ సర్కార్ తీర్చిదిద్దింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన ప్రభుత్వ విద్యకు జవసత్వాలు చేకూరేందుకు దోహదపడ్డాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అసాంఘిక శక్తుల చొరబాటును సమర్థవంతంగా తిప్పికొట్టే చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

పూర్వ వైభవం తీసుకువచ్చిన జగన్ సర్కార్..

ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం కల్పించిన విద్యను గత టీడీపీ ప్రభుత్వం పూర్తి నిర్వీర్యం చేసింది. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ బడులను మూత వేసే స్థితికి దిగజార్చారు. హేతుబద్ధీకరణ పేరుతో నిర్ణీత సంఖ్యలో విద్యార్థులు లేరన్న సాకు చూపి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మూతేశారు. ఫలితంగా 5 నుంచి 14 ఏళ్ల లోపు బాలబాలికలు ఎందరో విద్యకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకున్నారు. అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెన వంటి పథకాలతో విద్యార్థుల సంక్షేమానికి బాటలు వేస్తూనే మరో వైపు మన బడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా రూ.కోట్లు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వం పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు మొదటి విడత కింద 596 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.148 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఇందులో 196 ఉన్నత పాఠశాలలకు రూ.66 కోట్లు వెచ్చించారు. రెండో దశ నాడు-నేడు కింద మరో 1,102 పాఠశాలల్లో రూ.334 కోట్లతో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. నిరంతర నీటి సదుపాయం, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల ఏర్పాటు, విద్యార్థులు - సిబ్బందికి సరిపడా ఫర్నీచర్, పెయింటింగ్, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లిష్ ల్యాబొరేటరీలు, డిజిటల్ తరగతుల కోసం ఇంటరాక్టివ్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీల ఏర్పాటుతో ప్రభుత్వ బడుల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. ఈ క్రమంలో ప్రభుత్వ బడుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేలా..

పాఠశాలల్లో అసాంఘిక శక్తుల చొరబాటును అడ్డుకునేందుకు నైట్ వాచ్‌మెన్ల నియామకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించి గత నెల 18న మార్గదర్శకాలను జారీ చేసి, నియామకాలు చేపట్టింది. ఈ నెల 1వ తేదీ నుంచి వాచ్‌మెన్‌లు విధుల్లో ఉంటున్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.6వేల గౌరవవేతనాన్ని ప్రభుత్వం అందజేస్తోంది.

నియామకాల్లో ప్రాధాన్యత..

నైట్ వాచ్‌మెన్ల నియామకంలో ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఆయా పాఠశాలల్లో ఇప్పటికే ఆయాలుగా పనిచేస్తున్న వారి భర్తలకు తొలి ప్రాధాన్యత కల్పించారు. అనంతరం స్థానిక మాజీ సైనికులకు అవకాశమిచ్చారు. ప్రాధాన్యత కల్పించిన ఈ రెండు అంశాలకు సంబంధించి అభ్యర్థులు లేకపోతే పాఠశాలల పేరెంట్స్ కమిటీ సిఫారసు చేసిన వ్యక్తికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. వాచ్‌మెన్‌గా పని చేసే వారు తప్పనిసరిగా 60 ఏళ్లలోపు ఉండాలనే నిబంధన తప్పనిసరి చేశారు.

వాచ్‌మెన్ల విధులు ఇవే..

- పాఠశాల మూసి వేయడానికి ముందే సాయంత్రం నుంచి మరుసటి రోజు పాఠశాల తెరిచే వరకూ విధుల్లో ఉండాలి.
- పాఠశాల సెలవు దినాల్లోనూ విధుల్లో ఉండాలి.
- గార్డెనింగ్ పనులతో పాటు పాఠశాలల్లోని ఆర్వో ప్లాంట్లను శుభ్రపరచాలి.
- ప్రధానోపాధ్యాయుడి పర్యవేక్షణలో పని చేయాలి.
- రాత్రి వేళల్లో పాఠశాల ఆస్తులను రక్షించాలి.
- అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నా, అసాంఘిక శక్తులు ప్రవేశించినా తప్పనిసరిగా హెచ్‌ఎంతో పాటు పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలి.

పాఠశాలల భద్రతకు భరోసా..



గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రిని అపహరించుకెళ్లిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.సామగ్రిని ఆకతాయిలు ధ్వంసం చేసేవారు. నైట్ వాచ్‌మెన్ల నియామకంతో పాఠశాలల భద్రతకు భరోసా దక్కింది. జిల్లా వ్యాప్తంగా 238 ఉన్నత పాఠశాలల్లో నైట్‌వాచ్‌మెన్లను నియమించాం. - మీనాక్షి, డీఈఓ

పండ్ల అలంకరణలో అంజన్న



గుంతకల్లు రూరల్: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు శనివారం వేకువ జామున కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామికి అష్టోత్తర శత కలశాలతో అభిషేకాలు నిర్వహించాచి, వివిధ రకాల పండ్లతో అలంకరించారు. అనంతరం యాగశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించిన వేద పండితులు సాయంత్రం 5 గంటలకు ఉత్సవ మూర్తిని ఆలయ ముఖ మండపంలో కొలువుదీర్చి మల్లెపూలతో లక్షార్చన చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ డి.వెంకటేశ్వరరెడ్డి, ధర్మకర్త సుగుణమ్మ, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా





కెనాల్ నుంచి మృతదేహాలను వెలికి తీస్తున్న ఈతగాళ్లు , విగతజీవులుగా మారిన కుష్వంత్, శివచరణ్

- ఇద్దరు చిన్నారుల జలసమాధి
- రెండు కుటుంబాల్లో విషాదం
- మృతులు పార్నపల్లి వాసులు

యల్లనూరు: ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణం తీసింది. రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. యల్లనూరు మండలం శింగవరం గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శింగవరం గ్రామానికి చెందిన కుళ్లాయప్ప నూతన గృహ ప్రవేశ కార్యక్రమం శనివారం ఉదయం జరిగింది. వైఎస్సార్ జిల్లా లింగాల మండలం పార్నపల్లికి చెందిన పేతురు భార్య, తన ఇద్దరు కుమారులతో పాటు, రవీంద్రబాబు భార్య, ఇద్దరు కుమారులతో కార్యక్రమానికి హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనం చేశాక పేతురు పెద్ద కుమారుడు కుశ్వంత్ (8), రవీంద్రబాబు చిన్న కుమారుడు శివచరణ్ (13) గ్రామ సమీపంలోని పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో ఈత కొడదామని వెళ్లారు. కెనాల్‌లో నీరు ఉధృతంగా పారుతోంది. ఆ నీటిలో దిగిన చిన్నారులు లోతట్టు ప్రాంతంలో నీట మునిగిపోయారు. ఆ సమయంలో చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో వారిని గమనించలేదు. కొంత సేపటి తర్వాత ఇంటి వద్ద కుశ్వంత్, శివచరణ్ కనిపించడం లేదని తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అలా వెతుక్కుంటూ కెనాల్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ కుశ్వంత్, శివచరణ్ విగతజీవులై నీటిలో తేలియాడుతూ కనిపించారు. ఈతగాళ్లు వచ్చి మృతదేహాలను బయటకు తీశారు. దేవుడా ఎంత పనిచేశావయ్యా.. ముక్కుపచ్చలారని పిల్లలను తీసుకెళ్లిపోయావా అంటూ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. బంధుమిత్రులు సైతం పిల్లలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ రామకృష్ణ పరిశీలించి, దర్యాప్తు చేపట్టారు.

నెలాఖరు నుంచి అన్ని పాఠశాలలకూ జేవీకే కిట్లు

పరిగి/లేపాక్షి/చిలమత్తూరు/హిందూపురం టౌన్: జగనన్న విద్యాకానుక కిట్లను ఈ నెల 30 నుంచి అన్ని పాఠశాలలకు చేర్చాలని సంబంధిత అధికారులను డీఈఓ మీనాక్షి ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభించేలోపు పంపిణీకి సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ మేరకు ప్రణాళికబద్ధంగా అడుగేయాలని ప్రధానోపాధ్యాయులకు డీఈఓ మీనాక్షి సూచించారు. శనివారం పరిగి , లేపాక్షి, చిలమత్తూరు, హిందూపురంలో ఆమె పర్యటించారు. పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి కావాలని ఆదేశించారు. అనంతరం నిల్వ చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. ఇంకా అందాల్సిన వస్తువులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె వెంట పరిగి మండలంలో ఎంఈఓ లక్ష్మీదేవి, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ఎంఈఓ నాగరాజు, చిలమత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు అనూష, హిందూపురంలో ఎంఈఓ గంగప్ప, నాడు-నేడు స్పెషల్ ఆఫీసర్ మొరార్జీ యాదవ్, ఎంజీఎం హెచ్‌ఎం స్వామ్యం, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ: చిలమత్తూరు మండలంలో పర్యటించిన డీఈఓ మీనాక్షి కోడూరు పంచాయతీ పరిధి కంబాలపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు పట్టిక, మెనూ రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహార పంపిణీలో అలసత్వం ఉండకూడదని సూచించారు.



నాడు-నేడు పనులపై ఆరా తీస్తున్న డీఈఓ

ఉత్తమ ఫలితాల సాధనకు శ్రమించండి

మడకశిర రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను డీఈఓ మీనాక్షి ఆదేశించారు. శనివారం రాత్రి గుండుమలలోని కేజీబీవీలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యాచరణను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో ఎస్‌ఓ అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడారు. సప్లమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మట్కా స్థావరాలపై పోలీసుల దాడి



అరెస్ట్ చేసిన మట్కా బీటర్లతో సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ మునిప్రతాప్

మడకశిర: గుడిబండ మండలంలోని కుంబర నాగేపల్లిలో శనివారం సాయంత్రం మట్కా స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. మడకశిర సర్కిల్ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ సురేష్ బాబు వివరాలు వెల్లడించారు. సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో గుడిబండ ఎస్‌ఐ మునిప్రతాప్, సిబ్బంది దాడులు చేశారు. దాడుల్లో ఐదుగురు మట్కా బీటర్లు పట్టుబడగా, వారి నుంచి రూ. 2,61,100 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, మట్కాచీటీలు, పెన్నులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మట్కా బీటర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పెనుకొండ: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. శనివారం మధ్యాహ్నం రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలో జాతీయ రహదారిపై స్కార్పియో వాహనం ఢీకొందని, ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, వయసు 60 ఏళ్లు ఉంటుందన్నారు. వివరాలు తెలిస్తే.. సెల్: 9440796842లో సమాచారం ఇవ్వాలన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



మృతుడు వెంకటేశ్వర్లు

తాడిపత్రి: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి చాకలి వెంకటేశ్వర్లు (26) మృతి చెందాడు. రైల్వే జీఆర్‌పీ పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా బేతంచెర్ల గ్రామానికి చెందిన చాకలి వెంకటేశ్వర్లు తిరుపతికి రైల్లో వెళ్తుండగా, తాడిపత్రి – చల్లవారిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ జారిపడి, మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అమ్మతనం..కమ్మదనం



సందర్భం

మాతృ దినోత్సవం

ఆడ జన్మ అపు 'రూప'ం.. ప్రేమకు ప్రతిరూపం.. ఆత్మీయతలు, అనురాగాలకు అందమైన నిర్వచనం.. మాటల్లో చెప్పలేని మధుర భావం.. బిడ్డగా జన్మించి, భార్యగా బాధ్యతలు పంచుకున్నా.. సాటిలేదు..సాటిరాదు.. అత్తమ్మగా అజమాయిషీ చేసినా.. అవసాన దశలో అమ్మమ్మగా మిగిలినా.. ఎన్ని పాత్రలు పోషించినా అమ్మ.. అమ్మే.. నవమాసాలు మోస్తుంది..లాలించి, పాలిస్తుంది.. కల్మషంలేని కమ్మని ప్రేమను పంచుతుంది.. అడుగులు తడబడితే ఊతమవుతుంది.. నడక నేర్పుతుంది.. నడత మారుస్తుంది.. మన కోసం ఇన్ని చేసిన అమ్మ ఎప్పటికీ ప్రత్యక్ష దైవం.. అందుకే అమ్మకు ఒక రోజు అంకితం చేద్దాం.. మాతృ దినోత్సవంగా జరుపుకుందాం.. - అనంతపురం కల్చరల్

విలువలతో పెంచా



మాది తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి నల్గొండ జిల్లా వలిగొండ మండలంలోని నాగారం గ్రామం. నాకు ఆరుగురు కూతుళ్లు ఒక కొడుకు సంతానం. మేము చదువుకోలేదు. మా బిడ్డలను ఉన్నతంగా చదివించాలని తపించేదాన్ని. వ్యవసాయ పనులు చేసుకుంటూనే పిల్లలకు సంపాదనకన్నా.. విలువలతో జీవించాలని నిత్యం చెప్పుండేదాన్ని. మా చిన్నమ్మాయి రజిత పురావస్తు శాఖ ఏడీగా అనంతకు రావడంతో మాకిక్కడ కూడా సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. నేనెప్పుడూ ఆడపిల్లలు తక్కువ అని కానీ, మగపిల్లలే ఉండాలని కానీ అనుకోలేదు. నేటికీ అమ్మాయిలు నా బాగోగులు చూసుకునేలా పెంచా. వారి పిల్లలతో కూడా అలాగే ఉండాలని చెపుతా. ఆడవాళ్లకు ప్రేమ మాత్రమే కాదు ధైర్యం చాలా అవసరం.

– అమృత, పురావస్తు శాఖ ఏడీ రజిత తల్లి

తల్లిప్రేమలో తారతమ్యం ఉండదు



ఆడవాళ్లంటేనే ఆప్యాయతలు, సున్నిత మనస్తత్వం కలిగి ఉంటారు. ఇంటి బాధ్యతలు ఎన్ని ఉన్నా.. బిడ్డలను ప్రేమగా చూసుకోవడంలో వ్యత్యాసం ఉండదు. నా భర్త సత్యనారాయణ మొదటి భార్య ఉష కేన్సర్‌తో చనిపోయింది. ఆమె కొడుకు విష్ణు తల్లిలేని పిల్లాడయిపోయాడు. నేను కాపురానికి వచ్చినప్పటికి అతనికి పదకొండేళ్లు. ఇక పిల్లలు వద్దనుకొని విష్ణునే నా సొంత బిడ్డలా పెంచుతున్నా. తల్లి ప్రేమలో తేడా ఉండదు. పిన్ని అయినా కొడుకును బాగా చూసుకుంటున్నావని అందరూ అంటుంటే సంతోషంగా ఉంటుంది. నాకైతే మా అబ్బాయి విష్ణునే లోకం. కోడలిని కూడా తల్లిలా చూసుకోవాలని మా అబ్బాయికి చెప్తుంటా.

– కౌస్తుభమణి, అనంతపురం

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్నా..



స్వచ్ఛమైనది అమ్మ'తనం తొలి కాన్పులోనే వైకల్యంతో కొడుకు పుట్టాడు. వీడిని వదిలించుకుందామని భర్త రోజూ గొడవపడేవాడు. అయినా భర్తనే కాదనుకున్నా. పిల్లాడే లోకంగా బతుకున్నా. అసలే పేదరికం, దానికి తోడు సంపాదించే భర్త దూరమైనా ఆత్మస్థైర్యంతో నాలుగిళ్లలో పాచిపనులు చేసుకుంటూ దివ్యాంగుడైన కొడుకు సాయిని కంటికి రెప్పలా చూసుకుంటున్నా. నాలుగేళ్ల కిందట ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద అనాథగా వదిలేసి వెళ్లిపోయిన ఓ బిడ్డను కూడా అక్కున చేర్చుకొని పెంచుకుంటున్నా. ప్రభుత్వమందించే పింఛన్, 'అమ్మ' సంస్థ అందిస్తున్న ఆదరణే నాకు శ్రీరామరక్ష.

– రాజేశ్వరి, మూడోరోడ్డు, అనంతపురం

కొడుకు కోసం తాళి అమ్మేసింది



సనప గ్రామానికి చెందిన శివమ్మది మరో వేదనాభరిత జీవితం. భర్త వెంకటేష్ అనారోగ్యంతో ఇంటిపట్టునే ఉంటున్నాడు.కొడుకు విష్ణువర్ధన్ చిన్నతనంలో బాగున్నా 8వ తరగతి చదువుతున్నప్పుడు ఊపిరితిత్తుల సమస్య వచ్చింది. శస్త్ర చికిత్స చేయించినా ఫలితంలేదు. అలాగే కొడుకు వైద్యం కోసం ఆదరువుగా ఉన్న ఎకరా పొలాన్నే అమ్మేసింది. బంగారు తాళిబొట్టును కూడా అమ్మేసింది. రోజువారి వచ్చే కూలి రూ.300తో బతుకుపోరాటం సాగిస్తోంది. నెలసరి వైద్య ఖర్చులకే రూ.20 వేలు అవసరమవుతున్నా బిడ్డ కోసం ఆమె పడే తపన తల్లి ప్రేమంటే ఏమిటో వృద్ధాశ్రమాల్లో నిర్దయగా వదిలేస్తున్న బిడ్డలు తెలుసుకోవాల్సిందే. కొడుకు ఆరోగ్యం కోసం బతుకు పోరాటం సాగిస్తున్న శివమ్మ లాంటి అమ్మలు ఎప్పటికీ ఆదర్శమే.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న బాబావలి (ఫైల్)

ధర్మవరం అర్బన్: భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్థాపానికి గురైన భర్త ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ధర్మవరంలో శనివారం చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన బాబావలి (30) బీరువాల తయారీ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. బాబావలి, భార్య ముస్కాన్‌బేగంలు ఇద్దరూ గొడవపడ్డారు. దీంతో భార్య మూడు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రావాలని భార్యను పిలిచినా రాకపోవడంతో మనస్థాపం చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం తెల్లవారుజామున బాబావలి తల్లి గౌసియా హైదరాబాద్ నుంచి ధర్మవరానికి వచ్చి ఇంటి తలుపులు తీసింది. ఇంట్లో కుమారుడు ఉరికి వేలాడుతుండటాన్ని చూసి గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కలవారు వచ్చి ఉరికి వేలాడుతున్న బాబావలి మృతదేహాన్ని కిందకు దించారు. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. జమేదార్ సూర్యనారాయణ సిబ్బందితో ఘటనా స్థలికివెళ్లి పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను మృతుడి తల్లి గౌసియా ద్వారా తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు ఒక కుమారుడు ఉన్నాడు.

డిగ్రీ విద్యార్థి బలవన్మరణం



శిరీష (ఫైల్)

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం గ్రామానికి చెందిన శిరీష (22) ఉరి వేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి పద్మ, ఏఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన మేరకు.. శిరీష హాలుకూరు గ్రామంలో ఉన్న ప్రైవేటు ఆర్‌ఎంసీ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఉన్నత చదువులకు బెంగళూరుకు వెళ్తానని అడుగుతుంటే తల్లిదండ్రులు వారించారు. మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో బాత్‌రూములోకి వెళ్లి చున్నీతో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దూలానికి వేలాడుతున్న ఆమెను కిందకు దించి వెంటనే పీహెచ్‌సీకి తీసుకెళ్లగా, అప్పటికే ఆమె మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

15,030 కేసులకు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 23 బెంచుల్లో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 15,030 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. ఇరు వర్గాలు రాజీకి సమ్మతించడంతో 6,832 క్రిమినల్ కేసులు, 52 సివిల్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులు (పంచాయతీ టాక్సు కేసులు, మునిసిపల్ ట్యాక్స్ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు)8,106 , మోటారు వాహన ప్రమాద పరిహార 40 కేసులకు పరిష్కారం దక్కింది. ప్రమాదాల కేసుల్లో బాధితులకు రూ.3,30,12,000, సివిల్ కేసుల్లో రూ.98,33,271కు పైగా, ప్రిలిటిగేషన్ కేసుల్లో రూ.2,84,06,907ను కక్షిదారుల మధ్య రాజీ ఒప్పందం మేరకు న్యాయమూర్తులు ఇప్పించారు. లోక్ అదాలత్ నిర్వహణను జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి. శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి , కార్యదర్శి గరికపాటి దీనబాబు పర్యవేక్షించారు.

వీఆర్‌కు 'పురం' టూటౌన్ సీఐ

హిందూపురం: రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లును వీఆర్‌కు పంపుతూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఒకే స్టేషన్‌లో ఏడాది పూర్తయిన అధికారులను బదిలీ చేసే ప్రక్రియలో భాగంగా కర్నూలు జిల్లా ఆలూరుకు ఆయన బదిలీ అనివార్యమైనట్లు తెలుస్తోంది.

జాతీయస్థాయి విద్యా సంస్థల్లో ఎస్సీ విద్యార్థులకు ఉచిత విద్య

రాప్తాడురూరల్: కేంద్ర ప్రభుత్వం 'శ్రేష్ట' పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులకు జాతీయస్థాయి విద్యా సంస్థల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 9వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఉచిత ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సాయిరామ్ తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జూన్ 18న రాత పరీక్ష ఉంటుందన్నారు. మూడు గంటల పాటు జరిగే ఈ పరీక్ష (ఒక్కో ప్రశ్నకు 4 మార్కుల ప్రకారం 100 ప్రశ్నలు) 400 మార్కులకు రాయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు 2023 సంవత్సరంలో 8వ తరగతి, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. కుటుంబ వార్షికాదాయం 2.50 లక్షలలోపు ఉండాలని తెలిపారు. ఈ నెల 21 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 25, 26 తేదీల్లో దరఖాస్తులో ఏవైనా మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. జూన్ 5న పరీక్ష కేంద్రాలను వెల్లడిస్తారన్నారు. జూన్ 14 నుంచి అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంచుతారన్నారు. 18వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రాత పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష ఇంగ్లిష్, హిందీ భాషల్లో మాత్రమే ఉంటుందన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

చిలమత్తూరు: కోడూరు మన్రోతోపు వద్ద శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై నిర్మించిన కుషావతి నది వంతెనపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డి (65)ని ఐచర్ వాహనం వెనుకవైపు నుంచి బలంగా ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. అదే సమయంలో నడిచి వెళ్తున్న రామాంజనేయులును ఐచర్ వాహనం ఢీకొనడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు.. తోపు నుంచి పక్కనే ఉన్న తన స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడికి భార్య, కొడుకు ఉండగా, వారు శనివారం ఉదయమే ధర్మస్థలం దర్శనానికి వెళ్లారు. ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్‌ను సోమందేపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు.



ప్రమాదంలో మరణించిన నరసింహారెడ్డి

రైతుల శ్రేయస్సే ముఖ్యమంత్రి ధ్యేయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


ధర్మవరం రూరల్: రైతుల శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నేలకోట, ఏలుకుంట్ల క్లస్టర్ పరిధిలోని రైతులకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మైక్రో వాటర్ షెడ్ పథకం ద్వారా రూ.76.50 లక్షలు విలువ జేసే స్ప్రింక్లర్లు, ట్రాక్టర్ పనిముట్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్లు తదితర 379 యూనిట్లను 279 మంది రైతులకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండప్రాంతాల్లో ఉన్న ఏలుకుంట్ల, నేలకోట గ్రామాల పరిధిలో చెక్‌డ్యాంలు, ఫారంపాండ్లు నిర్మిస్తే భూగర్భజలాలు వృద్ధి చెందుతాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు, ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అధికారులు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించినప్పుడే వాటిని సద్వినియోగం చేసుకుంటారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ హయాంలో రూ.కోట్లు స్వాహా...

గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులకు డబ్బులు ఇవ్వాల్సి వచ్చేదని ఎమ్మెల్యే అన్నారు. మరుగుదొడ్లకు దొంగ బిల్లులు చేసుకొని స్వాహా చేశారన్నారు. నీరు – చెట్టు పథకం ద్వారా పాత గుంతలకే కొత్త బిల్లులు చేసుకొని రూ.కోట్లు కొల్లగొట్టిన చరిత్ర టీడీపీ నాయకులదేనన్నారు. మన ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఉద్దేశంతో చేస్తున్న కార్యక్రమాలకు మీరంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రామాంజనేయులు, అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్, అశోకుమార్, ఆగ్రోస్ సంస్థ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నేలకోట ఓబిరెడ్డి, కేశవ, వెంకటేష్ నాయక్, సంజీవరెడ్డి, రవీంద్రారెడ్డి, బుడ్డారెడ్డిపల్లి నారాయణరెడ్డి, బాలప్ప, శంకర్‌రెడ్డి, రమేష్, బిల్వంపల్లి హరి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు భారీ నష్టం

- దెబ్బతిన్న అరటి, మామిడి, వరి, మొక్కజొన్న పంటలు
- 15 రోజుల వ్యవధిలోనే రూ.32 లక్షల మేర పంట నష్టం
- విద్యుత్ శాఖకు రూ.50 లక్షలకు పైగా నష్టం



రాచువారిపల్లిలో నేలవాలిన అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి లక్ష్మి

పుట్టపర్తి అర్బన్: అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రూ.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. ఈ మేరకు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా అరటి, మామిడి, బొప్పాయి, వరి, రాగి, మొక్కజొన్న, కర్బూజా, దోస తదితర పంటలకు నష్టం వాటిల్లింది. గత నెలలో ముదిగుబ్బ, బత్తలపల్లి, ధర్మవరం, గుడిబండ మండలాల్లో కురిసిన అకాల వర్షాలకు 68 హెక్టార్లలో సాగు చేసిన వరి, రాగి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. 11 హెక్టార్లలోని మామిడి, బొప్పాయి తోటల్లో కాయలు రాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు రూ.20 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు అప్పట్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీ పెనుగాలులతో కూడిన వర్షాలకు పుట్టపర్తి, కొత్తచెరువు, గోరంట్ల, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో పంటలకు, ఉద్యాన తోటలకు భారీ నష్టం చేకూరింది. రాచువారిపల్లి రంగప్పకు చెందిన నాలుగు ఎకరాల్లో అరటి పంట పూర్తిగా నేలమట్టమైంది. జగరాజుపల్లి, వెంకటగారిపల్లి, బడేనాయక్‌తండా, గువ్వలగుట్టపల్లి గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. తోటలను కౌలుకు తీసుకున్న రైతులను అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బ తీశాయి. సుమారు 70 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారిక లెక్కలు చెబుతుండగా.. ఇందులో రూ.12 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. పెనుగాలులకు ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో ఒక్క రోజే దాదాపు రూ.50 లక్షలకు పైగా ఆ శాఖకు నష్టం వాటిల్లింది. గురువారం నుంచి ఇప్పటి వరకూ విద్యుత్ లైన్ల పునరుద్ధరణలో విద్యుత్ శాఖ అధికారులు తలమునకలుగా శ్రమిస్తున్నారు. కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు.

నివేదికలు సిద్ధం చేస్తున్నాం

ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టాలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు నివేదికలు సిద్ధం చేస్తున్నాం. ఉద్యాన తోటలకు సంబంధించి చెట్లు విరిగి పడితే మాత్రమే పరిహారం అందుతుంది. కాయలు నేలరాలితే నష్ట పరిహారం వర్తించదు. ఈ విషయాన్ని ఉద్యాన రైతులు గుర్తించాలి.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

ప్రభుత్వం ఆదుకోవాలి



15 ఎకరాల్లో నేను మామిడి సాగు చేస్తున్నా. మూడు రోజుల క్రితం కురిసిన గాలీవానకు 25 చెట్లు నేలమట్టమయ్యాయి. మూడు లారీలకు సరిపడేన్ని కాయలు రాలిపోయాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– చిన్నపరెడ్డి, ఉద్యాన రైతు, జగరాజుపల్లి